క్లుప్తంగా

ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

రాయవరం: ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండాలని, నేర నియంత్రణలో చురుగ్గా వ్యవహరించాలని ఎస్పీ రాహుల్ మీనా సూచించారు. రాయవరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ పోలీసులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తు ప్రగతిని ఎస్సై డి.సురేష్‌బాబు వివరించారు. అంతకు ముందుగా ఎస్పీ రాహుల్ మీనా ఇటీవల జరిగిన రాళ్ల దాడిలో వ్యక్తి మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు పూర్వాపరాలను సీఐ పి.దొరరాజు ఎస్పీకి వివరించారు.

విద్యుత్ అథారిటీ ఆదేశాలపైనే చార్జీల తగ్గింపు

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వానికి విద్యుత్ అథారిటీ మొట్టికాయలు వేయడంతో విద్యుత్ చార్జీలను తగ్గించారని, తగ్గించిన ఘనత తనదేనంటూ సీఎం చంద్రబాబు అబద్ధాలు చెప్పడం మానుకోవాలని కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు హితవు పలికారు. మండపేటలో మంగళవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ సీఎం చంద్రబాబు వ్యవహార శైలి హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమలులో ఉన్న విద్యుత్ చార్జీలు 30 శాతం తగ్గిస్తామని సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు అమలు చేయడంలేదన్నారు. 15 నెలలు కూటమి పాలనలో చార్జీలను తగ్గించడానికి బదులు ట్రూ అఫ్ ట్యాక్స్ పేరుతో రూ.15,708 కోట్లు ప్రజల నుంచి వసూలు చేశారని పేర్కొన్నారు. గతంలో ఉన్న విద్యుత్ టారిఫ్‌కు 30 శాతం యూనిట్ ధర తగ్గించాలని కామన డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ మాట్లాడారు.

కంటి వైద్య శిబిరం

రాయవరం: వెంటూరులో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ సీనియర్ నేత చిరట్ల సుబ్బారావు నిర్వహణలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు ప్రారంభించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, మండపేట నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరాం ప్రసాద్, చెల్లూరు పీఏసీఎస్ చైర్మన్ దేవళ్ల వెంకట్రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు సామాజిక అవగాహన ముఖ్యం

కపిలేశ్వరపురం: మహిళలకు తమ మానసిక, శారీరక ఆరోగ్యాలను ప్రభావితం చేసే సామాజిక అంశాల పట్ల అవగాహన అవసరమని సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎన్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో గ్రామంలో స్వస్థ్ నారీ-సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లిఖార్జునుడు, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి బి.రామారావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు.

అంత్యక్రియల్లో వాగ్వాదం

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల శివారు అగ్రహారానికి చెందిన కోటి సుబ్బారావు (76) సోమవారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని చోడవరంలోని స్మశాన వాటిక వద్ద ఖననం చేసేందుకు ఆయన కుటుంబ సభ్యులు రాగా.. చోడవరం గ్రామస్తులు కొందరు అడ్డుకున్నారు. దీంతో అగ్రహారం గ్రామస్తులు తరాలుగా గ్రామంలో ఎవరు చనిపోయినా ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని అడ్డు రావద్దని కోరారు. కానీ వారి మధ్య వివాదం సద్దుమణగకపోగా మరింత పెరిగింది. అగ్రహారం గ్రామస్తులు ధర్నాకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకున్న ఎస్సై నాగేశ్వరరావు ఇరుపక్షాలతో మాట్లాడి అంత్యక్రియలు జరగనివ్వాలని ఆదేశించారు. దీంతో సుబ్బారావు మృతదేహాన్ని ఖననం చేశారు. మృతుని బంధువులు ఎస్సైకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్య అన్నదానం ట్రస్టుకు హైదరాబాదుకు చెందిన బండారు హరికిషోర్, వనజ దంపతులు రూ.30 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని మంగళవారం ఆలయ ఉద్యోగులకు అందజేశారు. దాతకు అర్చకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈఓ సత్యనారాయణరాజు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

నేతన్నకు అందని చేయూత

- పేరుకుపోయిన బకాయిలు
- కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చేనేత సంఘాలు
- రెండు నియోజకవర్గాల్లో 13 సంఘాలు
- మండపేట నియోజకవర్గంలో రూ.11.02 కోట్ల బకాయిలు
- గత్యంతరంలేక ఉద్యమిస్తున్న నేత కార్మికులు



అంగర చేనేత సహకార సంఘం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న నేత కార్మికులు

కపిలేశ్వరపురం: చేనేత ఒకప్పుడు యావత్ భారత దేశానికి వన్నెతెచ్చిన వృత్తి. ఖ్యాతి గడించిన వృత్తి నేడు అష్టకష్టాలు పడుతోంది. వృత్తి నిర్వహణకు మార్గాలు ఆధునికత నేపథ్యంలో మూసుకుపోయాయి. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. చేనేత కుటుంబాల వారికి సంక్షేమాన్ని అమలు చేస్తూ సహకార సంఘాలకు రాయితీలు ఇస్తూ వృత్తిని రక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. ఆ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాలనపై నేతన్నలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి అంగర చేనేత సహకార సంఘం ఎదుట చేనేత కార్మికులు రెండు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో సహకార సంఘాలు

మండపేట నియోజకవర్గంలో మండపేట, ఏడిద, అంగర, నల్లూరు, నేలటూరు, రాయవరం, పసలపూడిలలో చేనేత సహకార సంఘాలున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో హసనబాద, శివల, అద్దంపల్లి, కాజులూరులో ఒక్కో సంఘం చొప్పున ఆదివారపుపేటలో రెండు సంఘాలున్నాయి. రెండు నియోజకవర్గాల్లో మొత్తం 13 చేనేత సహకార సంఘాలున్నాయి.

గుదిబండలా మారిన బకాయిలు

చేనేత సహకార సంఘం నిర్వహణ అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. ప్రభుత్వంపైనే ఆధారపడి కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా ప్రకటనలు తప్ప ఆశించిన స్థాయిలో సంఘాలకు బకాయిలను చెల్లించడం లేదు. వస్త్రాల కొనుగోలుకు సంబంధించిన ఆప్కో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. పావలా వడ్డీ పథకం, 20-30 శాతం రిబేటు పథకం, యార్న్ సబ్సిడీ పథకం, త్రిఫ్ట్ ఫండ్ పథకాలకు చెందిన బకాయిలు చేనేత వృత్తి ప్రగతిని మోకాలడ్డుతున్నాయి.

మండపేట నియోజకవర్గంలోని సంఘాల బకాయిలు ఇలా..

- మండపేట నియోజకవర్గంలో అంగర చేనేత సహకార సంఘానికి ఆప్కో నుంచి రూ.1.15 కోట్లు రావాల్సి ఉంది. పావలావడ్డీ రూ.61 లక్షలు, 20-30 శాతం రిబేటు పథకం బకాయి రూ.88.95 లక్షలు ఇతర సబ్సిడీలు కలిపి మొత్తం రూ.3.85 కోట్లు బకాయిలున్నాయి.
- నేలటూరు సహకార సంఘానికి ఆప్కో నుంచి రూ.46,89,000 రావాల్సి ఉంది. పావలా వడ్డీ రూ.16.44 లక్షలు, 20-30శాతం రిబేటు పథకం బకాయి రూ.7.91 లక్షలు కలిపి మొత్తం రూ.1.34 కోట్లు బకాయిలున్నాయి.
- నల్లూరు సహకార సంఘానికి ఆప్కో నుంచి రూ.50.10 లక్షలు రావాల్సి ఉంది. పావలావడ్డీ రూ.9.17 లక్షలు, 20-30 శాతం రిబేటు పథకం బకాయి రూ.7.21 లక్షలు కలిపి మొత్తం రూ.1.18 కోట్లు బకాయిలున్నాయి.
- మండపేట సహకార సంఘానికి ఆప్కో నుంచి రూ.1.94 లక్షలు రావాల్సి ఉంది. పావలావడ్డీ రూ.26.07 లక్షలు, 20-30శాతం రిబేటు పథకం బకాయి రూ.55.71 లక్షలు కలిపి మొత్తం రూ.1.87 కోట్లు బకాయిలున్నాయి.
- ఏడిద సహకార సంఘానికి ఆప్కో నుంచి రూ.11.82 లక్షలు రావాల్సి ఉంది. పావలావడ్డీ రూ.9.08 లక్షలు, 20-30శాతం రిబేటు పథకం బకాయి రూ.4.95 లక్షలు కలిపి మొత్తం రూ.47.74 లక్షలు బకాయిలున్నాయి.
- రాయవరం సహకార సంఘానికి పావలావడ్డీ రూ.3.23 లక్షలు, 20-30శాతం రిబేటు పథకం బకాయి రూ.10.07 లక్షలు కలిపి మొత్తం రూ.65 లక్షలు బకాయిలున్నాయి.
- పసలపూడి సహకార సంఘానికి ఆప్కో నుంచి రూ.22.04 లక్షలు రావాల్సి ఉంది. పావలావడ్డీ రూ.30.23 లక్షలు, 20-30శాతం రిబేటు పథకం బకాయి రూ.38.06 లక్షలు కలిపి మొత్తం రూ.1.62 కోట్లు బకాయిలున్నాయి.

తక్షణం బకాయిలను చెల్లించాలి

చేనేత సహకార సంఘం నుంచి ఆప్కో సంస్థ వస్త్రాలను కొనుగోలు చేస్తుంది. వాటికి సంబంధించిన మొత్తాన్ని సహకార సంఘాలకు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో సహకార సంఘాలు అవస్థలు పడుతున్నాయి. వాటిని వెంటనే ఇవ్వలేకపోతే సంఘాలు మూతపడే ప్రమాదం పొంచి ఉంది. కనీసం కొద్ది మొత్తంలోనైనా బకాయిలను చెల్లించాలని నేతన్నలు కోరుతున్నారు.

గత్యంతరంలేక రిలే నిరాహార దీక్ష



అనేక సార్లు ప్రభుత్వానికి బకాయిలను చెల్లించాలని విన్నవించాం. ఫలితం లేకపోయింది. గత్యంతరం లేక ప్రజాస్వామ్య పద్ధతిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్నాం.
– తేలు సత్యనారాయణ

సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలి



చేతి వృత్తులేవైనా సంఘాల సాయంపైనే ఆధారపడి ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో చేనేత వృత్తి రక్షణకు సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాల్సిన అవసరం ఉంది.
– చింతా మల్లికార్జునరావు

కునారిల్లుతున్న కుటుంబాలు



చేనేత వృత్తి రాను రానూ ప్రాధాన్యతను కోల్పోతుంది. దాంతో ఆ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు కునారిల్లిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.
– సిద్ధాని బసవలింగం

వృత్తి వలస పోతున్నారు



అంగరలో ఒకప్పుడు చేనేత వృత్తికి పెట్టింది పేరు. గతంలో సొసైటీలో 500 మందికి పైగా సభ్యులుండేవారు, ప్రస్తుతం 256 మంది మాత్రమే ఉన్నారు. జీవనం గడవక వృత్తి వలసలకు వెళ్లిపోతున్నారు.
– శలా రామలింగం, నేత కార్మికుడు, అంగర

లంకల్లో జలజడి



కోటిపల్లి రేవులో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- నీట మునిగిన ఉద్యాన పంటలు
- ఏటిగట్టు వెంబడి అధికారుల పర్యవేక్షణ

కె.గంగవరం: విపత్తు వీడిందనుకొని ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాలు, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు వరద భయం వెంటాడుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో కోటిపల్లి వద్ద వరద ఉధృతి ఎక్కువైంది. రెండు రోజుల నుంచి గంట గంటకు పెరుగుతూ వరద నీరు చుట్టుముట్టడంతో లంక గ్రామాల ప్రజలు, గోదావరి పరవాహక ప్రాంత ప్రజలకు ఆందోళన నెలకొంది. మండల స్థాయి రెవెన్యూ సిబ్బంది జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు గ్రామంలో వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బ్రహ్మపూరి వద్ద ఉన్న గోశాల పూర్తిగా వరదనీటిలో చిక్కుకుంది. మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపూరి, మసకపల్లి వరకు ఏటిగట్టు వెంబడి రైతులు సుమారు 3వేల ఎకరాల్లో పండిస్తున్న కొబ్బరి, అరటి, బొప్పాయి, కురగాయాల తోటలు పూర్తిగా నీటమునిగాయి. వరదనీరు తగ్గినా ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.



కూళ్ల వద్ద నీట మునిగిన బొప్పాయి తోటలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్ ప్రసాద్, ఎస్సై జానీ బాషా పర్యటించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కోటిపల్లిలోని కుమ్మరి సావరం వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో గట్టు పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు రానున్న రెండు రోజుల్లో మరింత గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పీహెచ్‌సీ ఆవరణలో పందుల బెడద

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో పీహెచ్‌సీ ఆవరణలో పందుల బెడద రోజురోజుకీ అధికమవుతోంది. పందుల సంచారంతో ప్రమాదకరమైన అంటు వ్యాధులు సోకుతాయని వైద్యులు సూచిస్తుండగా.. వైద్యాలయం ఆవరణలోనే అవి యథేచ్ఛగా తిరుగుతుండటంతో స్థానికులు విస్మయానికి గురవుతున్నారు. వ్యాధుల నుంచి స్వస్థత కోసం వస్తుంటే కొత్త వ్యాధులు సోకేలా ఉన్నాయని పలువురు రోగులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పెంపకందారులు విచక్షణా రహితంగా గ్రామంలోకి వదులుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పందులు పగలంతా వీధుల్లో తిరిగి రాత్రుళ్లు పీహెచ్‌సీలోనే మకాం వేస్తున్నాయి. పలుచోట్ల గృహ వాసాల మధ్య పందులు చనిపోతున్నప్పటికీ వాటిని ఎవరూ తీయకపోవడంతో దుర్వాస వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల స్వైర విహారాన్ని నిరోధించాలని డిమాండ్ చేస్తున్నారు.



రాత్రి వేళ గొల్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలో సంచరిస్తున్న పందులు

కార్యకర్తకు అండగా డిజిటల్ బుక్

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భరోసా ఇచ్చారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. మండల, గ్రామ స్థాయిలో కార్యకర్తలకు జరిగిన అన్యాయాల వివరాలను పూర్తిగా డిజిటల్ రూపంలో రికార్డు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, మెండు బాపిరాజు, జొన్నపల్లి సత్తిబాబు, ముక్కా సుబ్రహ్మణ్యం, రూరల్ మండల పార్టీ కన్వీనర్ అడబాల బాబ్జీ, నాయకులు షేక్ అలీ ఖాన్ బాబా, టపా పుల్లేశ్వరరావు, పోతుల దుర్గా ప్రసాద్, యరమాటి వెంకన్నబాబు, కోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మండపేటలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

ఎమ్మెల్సీని కలిసిన ఉంగరాల సంతోష్

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధికార ప్రతినిధి ఉంగరాల సంతోష్ మండపేట పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను తోట సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

రాయవరం: రాళ్ల దాడి చేసి ఒకరి మరణానికి కారణమైన ఘటనలో ఇరువురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. రాయవరం పోలీస్టేషన్‌లో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరం పోలమ్మ తల్లి ఆలయం పక్కన పంచాయతీ స్థలంలో సత్రం ఉంది. దాని ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద ముత్యాలమ్మవారి విగ్రహాన్ని పెట్టి చాలాకాలం నుంచి స్థానిక వెలమ సంఘ సభ్యులు పూజలు చేస్తున్నారు. సత్రం కూలిపోయిన అనంతరం స్థలం ఖాళీగా ఉండడంతో అక్కడ ముత్యాలమ్మ గుడి నిర్మించాలని వెలమ సంఘం సభ్యులు 2023లో పనులు ప్రారంభించారు. ఆ స్థలం తనకు చెందినదంటూ రేలంగి నాగేశ్వరరావు వాదనకు దిగేవాడు. ఆ ప్రదేశంలో ఎటువంటి కట్టడాలు నిర్మించకుండా అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించాడు.

ఆ స్థలం ఎవరికి చెందినదో వివరాలు ఇవ్వాలని న్యాయస్థానం పంచాయతీకి ఆదేశాలు జారీ చేసింది. గత నెల 28న వెలమ సంఘం సభ్యులు దసరా నిమిత్తం ముత్యాలమ్మ గుడి వద్దకు వెళ్లి శుభ్రం చేసి, షెడ్డు నిర్మాణం చేపట్టగా, రేలంగి నాగేశ్వరరావు అతని భార్య రేలంగి రమణ కలిసి వెలమ సంఘ సభ్యులతో గొడవకు దిగారు. వారి ఇంటి రెండవ అంతస్తు నుంచి ఇటుక రాయిలతో వెలమ సంఘ సభ్యులపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురికి గాయాలు కాగా, బోదంకి సత్యనారాయణ మృతి చెందాడన్నారు. ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఏవీఆర్‌బీ ప్రసాద్ సూచనల మేరకు, రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో హత్య, హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసులో నిందితులైన రేలంగి నాగేశ్వరరావు, రేలంగి రమణను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.



కేసు వివరాలు తెలుపుతున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు, అరెస్టయిన నాగేశ్వరరావు, రమణ

తెగుళ్ల వ్యాప్తికి సమయమిదే

కాజులూరు: వరి పంటపై తెగుళ్ల విజృంభనకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి అశోక్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి, మతుకుమిల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఏఓ అశోక్ పర్యటించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం డెల్టాలోని వరి పొలాలు స్థితిగతులు, వాటిపై సోకే తెగుళ్లపై పలు సూచనలు చేశారు. మండల గ్రామాల్లోని వరి పొలాలు చిరుపొట్ట దశలో ఉన్నాయన్నారు. ఈ దశలోనే మాగుడు తెగులు, దోమ, ఆకునల్లి, ఆకుముడత వంటి తెగుళ్లు ఎక్కువగా వ్యాపిస్తాయన్నారు. రైతులు తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి తగు నివారణ చార్యలు తీసుకోవాలన్నారు.

సంఘ అభివృద్ధికి సహకరించాలి

అంబాజీపేట: సొసైటీ ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని సొసైటీ చైర్మన్ అరిగెల సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) రైతులను కోరారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో మహాజన సభ సూరిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. డీసీసీబీలో కుదవపెట్టిన బంగారంపై ఎక్కువ శాతం వడ్డీని వేస్తున్నారని, దాంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాకలగరువు ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వాణిజ్య, జాతీయ బ్యాంకుల కన్నా సొసైటీల ద్వారా డిపాజిట్లపై 8.5 శాతం వడ్డీని ఇస్తున్నామని, అందుకే బంగారం రుణంపై 9.9 వడ్డీ వేస్తున్నారని డీసీసీబీ అంబాజీపేట బ్రాంచ్ మేనేజర్ బి.నాగేశ్వరరావు సభ్యులకు వివరించారు. అంతకుముందు సొసైటీ సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు సొసైటీ లావాదేవీల ఆర్థిక నివేదికను సభకు సమర్పించారు. కార్యక్రమంలో త్రిసభ్యకమిటీ సభ్యులు ఉందుర్తి సత్యనారాయణ, పితాని వెంకట సత్యప్రసాద్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, మద్దింశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ అధికారుల ప్రకటనపై ఆగ్రహం

మామిడికుదురు: పాశర్లపూడి బాడవలో ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకేజ్‌ను అదుపు చేసేందుకు మంగళవారం అక్కడకు జేసీబీతో చేరుకున్న సిబ్బందిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఏ విధమైన లీకేజ్ ఏర్పడలేదంటూ తప్పుడు ప్రకటనలు ఎందుకు చేశారో ముందు వివరణ ఇవ్వాలని నిలదీశారు. లీకేజీని అదుపు చేయడం మానేసి అటు ప్రజల్ని, ఇటు ప్రభుత్వ అధికారులను ఓఎన్‌జీసీ తప్పుదోవ పట్టిస్తోందంటూ తీవ్రంగా మండిపడ్డారు. దీంతో ఏం చేయాలో తెలియక ఓఎన్‌జీసీ అధికారులు తలలు పట్టుకున్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది వచ్చి స్థానికులకు నచ్చ చెప్పారు. దీంతో స్థానికులు శాంతించారు. లీకేజ్ ఏర్పడిన ప్రాంతంలో పైపునకు రిపేర్స్ చేసి లీకేజీని అదుపు చేశారు.

మాతా నమామి.. మనసా స్మరామి

- దుర్గాదేవి రూపంలో విజయదుర్గ అమ్మవారు
- వాడవాడలా వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు

రాయవరం: శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వాడవాడలా పలు ఆలయాల్లో దుర్గాదేవిని భక్తులు మాతా నమామి..మనసా స్మరామి అంటూ కొలుస్తున్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం మండలంలోని వెదురుపాక విజయదుర్గా అమ్మవారు భక్తులకు దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులనుద్దేశించి పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. పలువురు భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు సామూహికంగా లలితా సహస్రనామార్చనలతో కుంకుమ పూజలు చేశారు. సోమేశ్వరంలోని చారిత్రక శివాలయంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి పూజలు చేశారు.



సోమేశ్వరం శివాలయంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో మంగళవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు దుర్గాష్టమి పురస్కరించుకుని దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో కాళికా దేవి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులను అలరించారు.



కాళికా దేవిగా ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి